

# చిలుక-పంజరము

సుదర్శనం తన మంచముపై వెల్లికిలా పడుకొని రోడ్డువంక తదేక ధ్యానంతో చూస్తున్నాడు. అతని బుఱ్ఱలో ఎన్నో ఆలోచనలు కల్గుతూ మాయమవుతున్నాయి తైలస్పర్శ వున్నప్పటికి, మాటి - మాటికి తలను చేతితో అదిమి పట్టుకుంటూ వుండడంవలన కొంచం జుత్తు రేగింది. గడ్డం కొంచం మాసింది. ఆతని సన్నని పొడుగాటి ముక్కుకు యిరువైపుల నున్న చిన్న కళ్ళల్లో యేదో తెలియని భయం గోచరిస్తూ వుంది

ఆయింట్లో వున్నవి రెండే రెండు గదులు, ఒకటి చిన్నగది, రెండవది కొంచం పెద్దది. చిన్నగదికి వరండా కుడివైపున వుంది. సుదర్శనం తన ఆఫీసు నుండి ఏవో ఫైల్సు తెచ్చుకుంటూ, ఆచిన్న గదిలో తన పని చూచుకుంటూ వుండడం అతనికి అలవాటూ - పరిపాటిన్నూ. ఈ రెండు గదుల వెనుక చిన్న వంట గది. చిన్న బావి కూడా వున్నాయి. సుదర్శనం మంచం మీద నుండి లేచి, పెద్దగది దాటుకుంటూ సరాసరి వరండా మీదకు వచ్చేడు.

అప్పుడే వాన వెలిసింది. కాని చిటపటగా చినుకులు పడ్తునే వున్నాయి. బరువెక్కిన మేఘాలు మెల్లగా పయనిస్తున్నాయి. తిరిగి రోడ్డుపైన జన సంచారం యెక్కువైంది కార్లు, టాక్సీలు, రిక్షాలు మొదలైన వన్నీ తుర్-బుర్‌న దూసుకుపోతూ రొడ్లపైనున్న బురద నీటిని తుళ్ళిజేస్తు న్నాయి. అప్పటికే సుమారు సాయంకాలం ఆరు కావస్తూంది మబ్బుగావుండి చీకటిగా వుండడం వలన రోడ్లకు ప్రక్కనున్న కొట్లలో ఎలక్ట్రిక్ దీపాలు ఒకొక్కటి వెలుగుతున్నాయి.

చీకటి ఆవరిస్తున్నప్పటికి, స్విచ్ ఆన్ చేయాలనే సంగతికూడా మరచి పోయేడు సుదర్శనం. ఇల్లంతా చీకటిగా వుంది. కాని అతని కళ్ళు ఆలోచనలతో నిండి చీకటినికూడా చీలుస్తాయేమో అనిపిస్తూంది.

ఎంతగానో చెప్పేడు తను లలితకు, కాని వింటేగా! తన పట్టు విడువక తప్పకుండా వెళ్లాననే మారాం చేసింది తన అక్కనుచూచి చాలా రోజులైందని, అదీగాక, తన అక్క కొడుక్కి 'ఆదివారం' నాడు బారసాలని, అందుకని తను తప్పకుండా వెళ్లాలంది. తర్వాత వెళ్ళవచ్చునని చెప్పాడు సుదర్శనం. కాని వినలేదు. భార్యను స్వయంగా తీసుకు వెళదామంటే సెలవు దొరకలేదు గట్టిగా అడుగితే ఆఫీసరు యేమంటాడో? అనే భయంతో, తను

రచన:

"హరనాద్"

తీసుకు వెళ్ళలేదు ఆమె తన మొండి పట్టు విడువదు. అందుకని సుదర్శనం ఒకటి - రెండు సార్లు కోప్పడ్డాడు కూడా దాంతో ఆరోజంతా ఒకటే యేడ్పు. లలితతోసహా తన మూడేళ్ల కూతురు - సరోజకూడా, లలిత మెడను తన చిట్టిచేతులతో పట్టుకొని, ఇంటి పెంకులు దద్దరిల్లేటట్లు యేడ్వ ప్రారంభించింది. ఆరోజంతా లలిత తినలేదు - సరిగదా వంటకూడ చేయలేదు. ఆనాడతనికి హోటలే గతైంది. కాని యేం చేస్తాడు సుదర్శనం? విధిలేక లలితను, సరోజను ఆమె అక్కగారూరగు 'బెజవాడ' పంపించేశాడు.

సరోజ వెళ్ళేటప్పుడు, "నాన్నా నాకోసం పెంచిన చిలుకకు జాగ్రత్తగా బువ్వా - పాలు, పెడ్తూవుండాలి" అంటూ సుదర్శనంతో తన వచ్చిరాని మాటలతో చెప్పింది. తను 'సరే' అన్నాడు.

ఇపుడతని ఆలోచనంతా వారిద్దరూ క్షేమంగా 'బెజవాడ' చేరారో లేదో అని. తనువారితో సహాయంగా యెవర్ని పంపించలేదు. అప్పటికే సుమారు ఆరు రోజులైంది వారు వెళ్ళి. వుత్తరంకూడా వ్రాసేడు. జవాబులేదు, అతనికి యిప్పుడు మరీ ఆరాటం హెచ్చింది. టెలిగ్రాం ఇద్దామంటే ఆరోజంతా ఒకటే వాన. గొడుగు వేసుకొని బురద-బురదగా వున్న రోడ్డుపై పోవాలంటే బద్ధకం వేసింది.

ఇంతలో గదిలోని ఎలక్ట్రిక్ బల్బు ఒక్కసారిగా వెలిగింది. వులిక్కిపడ్డాడు సుదర్శనం. నౌకరు 'రామన్న' సరాసరి గది దాటుకుంటూ వరండామీదకు వచ్చి, "బాబూ అంట్లు కడిగేసేను. రాత్రికి వంట చేయనా? యెందుకో బాబుగారీ యేళ అస్తీగా యున్నారు." అన్నాడు.

"వంట చేయొద్దు. రేపురా" అన్నాడు సుదర్శనం.

అతను పోబోయేసరికి సుదర్శనం, "రామన్నా" అని పిల్చేడు.

వరండా మెట్లు దిగుతూ ఆగి, "యేం బాబు యెందుకు పిల్చారు"?

"టెలిగ్రాం వ్రాసి ఇస్తాను. పోస్టాఫీసుకు పోయి టెలిగ్రాం చేయగలవా?"

"టెలిగ్రామా?" - "ఎవరికి బాబు?"

"అవన్నీ నీకెందుకు తీసుకెళ్ళు" విసుక్కున్నాడు.

వెంటనే అక్కడికి క్షేమంగా చేరారో లేదో తెలియజేయమంటూ లలిత పేర టెలిగ్రాం ఇచ్చాడు సుదర్శనం.

రామయ్య టెలిగ్రాం పట్టుకుపోయేడు. సుదర్శనానికి తిరిగి ఆరాటం హెచ్చింది పెద్దగదిలోనికి పోయి, మంచంపై కూలబడ్డాడు. ఇంతలో సరోజ చిలక సంగతి జ్ఞాపకానికి వచ్చింది. ఒక్కసారిగా దేహం గగుర్పొడిచింది. నిన్నటినుండి ఆలోచనలో మునిగి తిండికూడా పెట్టడం మానేశాడు. "వెధవ - రామయ్యకూడా చెప్పాడు కాదు, వాడి కెక్కడలేని మతిమరుపు" అంటూ. తనలో తనే విసుక్కుంటూ తిరిగి వరండామీదికి వచ్చేడు. దానికోసం

పంజరం తయారుచేయడానికి చెప్పాడు. కాని ఇంతవరకు తయారుకాలేదు. అందు కని చిన్న బుట్టను మూతగా పెట్టి తన ఆఫీసు రూమ్ (చిన్న గది) లో పెట్టాడు.

పెద్దదికూడా కాదు ఆ చిలుక. చిన్న పిల్ల యేమయ్యింటుందో అని సంశయిస్తూ తన ఆఫీసు రూమ్ తలుపు తట్టి లోపల ప్రవేశించాడు బుట్ట ఒక చివర పడివుంది మరి చిలుక పిల్లో! ఒక్క క్షణం హతాశుడై గుడ్లప్పగించి నిలబడ్డాడు సుదర్శనం అతని దేహం నిలువునా కంపించింది.

చిలుక పిల్లకు బదులుగా చిలుక యెముకలు పడివున్నాయి. ఈ రెండు రోజుల నుండి పుట్టిన అశాంతివలన అన్ని విషయాలు మర్చిపోయాడు సుదర్శనం ఆ చిన్నగదికి ఓ చిన్న కిటికీ వుంది. దాన్ని ప్రతిరోజు సాయంకాలం పూట రామన్నో, తనో మూసేసేవారు. కారణం దానిలోచిన్న చిలుక పిల్ల వుండడమే, కాని-కావి నిన్నటి నుండి ఆ చిన్న కిటికి తెరిచే వుంది రామన్న మూయడం మరిచేడు. తనూ, అంతకన్నా, అందువల్ల ఏపాడు పిల్లో తన పొట్టన పెట్టుకుంది. ఆ యెముకల చుట్టూ, చీమలు మూగి వున్నాయి ఆదృశ్యం చూడలేక మెల్లిగా తలుపును మూసి తిరిగి పెద్దగదికి వచ్చి మంచంమీద కూలబడ్డాడు. చిలుక పిల్ల విషయమే జ్ఞాపకానికివచ్చింది. ఎన్నో ఆలోచనలు .... ఏవో వూహలు.

ఒకరోజున యెవడో కోయవాడు తెచ్చేడు ఆ చిలక పిల్లను సరోజ కొనమని మారాం చేసింది 'సరే' అంటూ కొన్నాడు, సుదర్శనం. పాపం! ఆచిలుక పిల్లకు చిన్నప్పుడే తల్లినుండి వియోగం కల్గింది. సంతాన వియోగం వలన, ఆ చిలుక దంపతులు యెంతగా కలతచెంది యుంటాయో గదా! దానిని తను బంధించేడు. దాని స్వాతంత్ర్యముకు అడ్డుపడ్డాడు. అప్పుడే ఖైదునుంచి వెలువడిన ఖైదీ యెంత సంతోషంగా పరుగెడుతూ బయటకు వస్తాడు! తృప్తి తీరేవరకు యెంతగా తిరుగుతాడు! ఈ సంగతి అప్పుడు తన మెదడుకు తట్టలేదు. ఇలాగే యేమో ఆలోచిస్తుండగా అతనికలా మగత నిద్రపట్టింది.

* * * *

ఇంతలో 'కెవ్వున' కేక వినపడింది. ఆస్వరం తనకు సుపరిచితమే. అదే! లలిత వేసిన కేక. హఠాత్తుగా వ్రాయడం మాని తలెత్తి చూచేడు, సుదర్శనం. లలిత తనను సమీపిస్తూవుంది. ఆమె కంటి కను కొనలనుండి కన్నీటి బిందువులు జలజలా రాల్తూ చెక్కిళ్ళను స్పృశిస్తున్నాయి. వెక్కి వెక్కి యేడుస్తూంది. తను ఆఫీసు గదిలో కూర్చొని ఏవో ఫైల్సు చూచుకుంటూ వున్నాడు అయినా, అతని మనస్సు ఆ రోజంతా స్థిమితంగా లేదు సరోజకు తీవ్రంగా జ్వరం వచ్చింది టెంపరేచరు, నూటమూడు, నూటనాలుగు డిగ్రీలవరకు వచ్చింది. లలిత ఇంకా దగ్గరకు సమీపిస్తునేవుంది. అంతవరకు ఫైల్సు చూస్తున్న సుదర్శనం, హఠాత్తుగా వులిక్కిపడ్డాడు.

"యెందుకు - యెందుకేడుస్తున్నావ్?" అని అడిగేడు, సుదర్శనం తొట్రుపాటుతో.

"సరోజ మనను విడిచి పోయింది మరినేను బ్రతకను" అంటూ తలను ద్వారం కేసి కొట్టుకుంది. రక్తం స్రవించింది

"ఆ(" అంటూ కూలబడ్డాడు, సుదర్శనం.

* * * *

దిగ్గున లేచాడు, సుదర్శనం. చుట్టూ కలియ చూచాడు. యెవ్వరూ లేరు. కళ్ళు చెమ్మగిలివున్నాయి ఎలక్ట్రిక్ లైటు వెక్కిరించినట్లు వెలుగుతూంది. గోడ గడియారం టిక్కు - టక్కు లాడుతూ నిశ్శబ్దాన్ని చీలుస్తూంది. తెరచిన కిటికీ నుంచి వస్తూన్న గాలికి గోడకు తగిలించి యున్న 'సయాపైసాల మారకపు పట్టీ' అట్టు టప-టప లాడుతూంది.

ఆ రాత్రి మరి నిద్రపట్టలేదు. నిద్రపోదామని ప్రయత్నించాడు. లైటు వెలగడం వలన నిద్ర పట్టలేదేమోనని లైటు ఆర్పాడు. కాని నిద్రపట్టలేదు

తెల్లవారింది. కుర్చీలో కూర్చొని అవ్యక్తమైన బాధవలన సుస్పష్టమౌతున్న ముఖకవళికలతో యేదో ఆలోచిస్తున్నాడు సుదర్శనం.

"బాబూ! మీకు టెలిగ్రాం వచ్చింది" అంటూ 'రండా మెట్లెక్కి పైకివచ్చాడు మెసంజరు. వులిక్కిపడి, టెలిగ్రాం అందుకొని తొందరగా చించాడు. సంతోషం పట్టలేక, గదిలోకి గంతేసి కోటుజేబునుండి రూపాయి తీసి, మెసంజరుకి అందించాడు.

"ఇది మామూలే కదండీ." నమస్కరించి మరీ పోయాడు మెసంజరు.

టెలిగ్రాం వచ్చింది, లలిత వద్దనుంచి. అందరూ క్షేమంగా వున్నారని. ఏదో పెద్ద బండ నెత్తినుండి బయటకు తీసినట్లయింది. ఈల వేసుకుంటూ పదే పదే టెలిగ్రాం చూచుకున్నాడు సుదర్శనం.

ఇంతలో రామన్న పంజరంతో సహ వచ్చి టేబులు మీద పెట్టాడు.

"ఏంటో బాబుగారు నిన్న లేంది. ఈయాళ ఈలేసుకొని హుషారుగా వున్నారు. పంజరం తెచ్చేను."

"మహ గొప్పపని చేసేవులే" అని నసిగాడు సుదర్శనం. ఆ మాటలు విని పించుకోకుండానే వంటగదికి పోయాడు రామన్న. శూన్యపంజరంకేసి, చూచి మెల్లిగా నిట్టూర్చాడు సుదర్శనం

--- :O: ---


## శ్రీ యోగాశ్రమము
## పెదవాల్తేరు
### విశాఖపట్టణము - 3

డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానము లేని వారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

వివరములు తెలియగోరువారు ఒక రూపాయి పంపవలయును.